

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 18.0

ఉలికిపాటు..!

ఏలూరులో 15 మంది మావోయిస్టుల అరెస్టు
గ్రీన్‌సిటీలోని ఓ భవనంలో నెల రోజులుగా నివాసం
వీరిలో ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు
వట్లూరు సమీపంలోని ప్రైవేటు హాస్టల్‌లో మరో విద్యార్థి..
ఎస్పీ కిశోర్ ఆధ్వర్యంలో మఫ్టీలో చుట్టుముట్టిన పోలీసులు
45 నిమిషాల్లో ముగిసిన ఆపరేషన్.. భారీ భద్రత మధ్య విచారణ
ఉలిక్కిపడిన ఏలూరు, పశ్చిమ జిల్లాల ప్రజలు

ఏలూరు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):మంగళవారం ఉదయం ఏలూరు నగరం ప్రశాంతంగా వుంది. ఎవరి పనుల్లో వారు బిజీగా వున్నారు. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. నగరంతో పాటు జిల్లా పోలీసులు అలర్ట్ అయ్యారు. అన్ని పోలీసు స్టేషన్‌లలో వున్న వారిలో ఎక్కువ మంది మఫ్టీలోకి మారి పోయారు. ఆఘమేఘాల మీద ఏలూరు మినీ బైపాస్‌లో ఉన్న కేకేఆర్ గ్రీన్‌సిటీ సమీపానికి చేరుకున్నారు. వివిధ మార్గాల నుంచి ఒక్కొక్కరు అడుగులు వేసుకుంటూ వచ్చారు. కొందరు రోడ్లు తుడిచే వారుగా, మరికొందరు కూలీలుగా ఆ ప్రాంతంలో తిరుగుతూ ఒక బిల్డింగ్ వద్దకు చేరుకున్నారు. ఏం జరుగుతుందో ఎవరికి తెలియడం లేదు. ఓ వైపు ఆకాశంలో డ్రోన్ కెమెరాలు ఎగురుతున్నాయి. ఆ ప్రాంతం వీధుల చివర పోలీసు జీపులు వచ్చి చేరు తున్నాయి. మరో 20 నిమిషాలు గడిచేసరికి గ్రీన్‌సిటీలో వున్న డోర్ నెంబర్ 22-136-9 వడ్లపూడి నాగభూషణా చార్యులు, పార్వతి ప్రసన్నం పేరు మీద ఉన్న శ్రీ సాయి నివాసం భవనాన్ని చుట్టుముట్టారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్ సైతం మఫ్టీలో ప్రత్యక్షమయ్యారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఇతర ప్రాంతాల ఎస్‌ఐలు, సీఐలు, సిబ్బంది అక్కడే కనిపించారు. అంతలోనే విజయవాడ నుంచి వచ్చిన 30 మంది గ్రేహౌండ్స్ పోలీసులు బులెట్ ప్రూఫ్ జాకెట్లతో ఆ భవనంలోకి ఒక్కసారిగా ప్రవేశించారు. క్షణాల వ్యవధిలో లోపల ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులను ముసుగులు వేసి బయటకు తీసుకు వచ్చారు. అప్పటికే సిద్ధంగా వుంచిన బస్సులో వారిని ఎక్కించారు.ఇంతలో మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురి మృతి, పలుచోట్ల మావోయిస్టుల అరెస్ట్‌ల వార్తలు రావడంతో.. వీరు కూడా మావోయిస్టులు అయ్యి వుంటారని స్థానికులు భావించారు.వీరి ఊహించినది కరెక్టేనని తర్వాత పోలీసులు నిర్ధారించడం మీడియాలో వార్తలు రావడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



మావోయిస్టులను విచారిస్తున్న మహిళా పోలీస్‌స్టేషన్

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌తో..

కోట్లాది రూపాయల రివార్డు వున్న మోస్టు వాంటెడ్ మావోయిస్టు నాయకుడు హిడ్మా, అతని భార్య, మరో నలుగురు మారేడుమిల్లిలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో హత మయ్యారు. అక్కడ లభించిన డైరీ, ఇతర ఆధారాలతోనే ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మావోయిస్టులు ఉన్నట్లుగా గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఏలూరులో షెల్టర్ జోన్‌గా తలదాచుకున్న 14 మంది మావోలను అదుపులోకి తీసు కున్నారు. వీరిని పెదవేగి డీటీసీకి తీసుకు వెళ్ళి అక్కడ నుంచి సాయంత్రానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఆ తరువాత సాయంత్రానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా నిర్మించి ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్ భవనంలో ఉంచి వారిని విచారిస్తున్నారు. మరోవైపు విజయవాడ నుంచి ప్రత్యేక ఉన్నతాధికారుల బృందం వచ్చి వారిని విచారి స్తున్నట్లు సమాచారం. బుధ వారం వారి అరెస్టును మీడియా ముందు ప్రవేశపెట్టే ఆవకాశాలు ఉన్నాయి. మావోయిస్టులను ఏలూరు నగ రంలో అరెస్టు చేశారని తెలియడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. వీరంతా నెల రోజుల నుంచి ఈ భవనంలో వుంటున్నారని స్థాని కులు చెబుతున్నారు. పగటి వేళ ఒకరిద్దరు కనపడేవారని, రాత్రి రెండు గంటల వరకూ లైట్లు వెలుగుతూ ఏవో శబ్దాలు వినిపించేవని చెప్పారు. వీరు జిల్లాకు ఎందుకు వచ్చారనేది తేలాల్చి వుంది. షెల్టర్ జోన్‌గా వినియో గించుకోవడానికి వచ్చి పోలీసులకు చిక్కినట్లు భావిసు న్నారు. దీనిపై పూర్తి వివరాలు వెల్లడించాల్చి ఉంది.



మహిళా మావోయిస్టులను భవనం నుంచి బయటకు తీసుకొస్తున్న మహిళా పోలీసులు

అడవుల నుంచి నగరాల్లోకి..

ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బలగాలు వరుస ఎన్‌కౌంటర్‌లతో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో వారికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అటవీ ప్రాంతం సురక్షితం కాదనుకున్నారో ఏమో కాని నగర ప్రాంతాల వైపు మావోలు దారి మళ్లించారు. సామాన్యులుగా, కూలీలుగా ఇళ్లను అద్దెకు తీసుకుని తమ కార్యకలాపాలు చాపకింద నీరులా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏలూరులోని కెకెఆర్ గ్రీన్ సిటీలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని, ఆ ఇంటికి సీసీ కెమెరాలు బిగించుకుని 14 మంది మావోలు ఇక్కడే ఉంటూ తమ కార్యకలాపాలు కొనసాగించారు. మరో విశేషం ఏమిటంటే వారు ఉన్న భవనానికి వంద మీటర్ల దూరంలోనే పోలీస్ శాఖకు అనుబంధంగా ఉన్న శాఖల్లో పనిచేసేవారు, వివిధ శాఖల అధికారులు నివాసాలు ఉన్నాయి. కానీ ఎవరికి అనుమానం రాకుండా నెల రోజుల నుంచి ఆ ఇంట్లో ఉంటూ తమ కార్యకలాపాలు

- మిగతా 6లో..



కుక్కునూరు మండలం కొత్తలంకాలపల్లి ఆదివాసి గ్రామంలో ఎస్సై రాజారెడ్డి, పోలీస్ బృందం

ఏజెన్సీలో అప్రమత్తం

ఆదివాసీ గ్రామంలో పోలీసుల తనిఖీలు

కుక్కునూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో పోలీసులకు మావో యిస్టులకు జరిగిన కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత హిడ్మా సహా మరో ఐదుగురు మృతి చెందడం, ఏలూరు, విజయవాడ, కాకినాడ నగరాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా కేంద్ర ఇంటిలిజెన్స్ శాఖ గతంలోనే గుర్తించింది. ఏలూరు జిల్లాకు సరిహద్దుకు గోదావరి నది వుంది. దీనికి అవతల వైపు చత్తీస్‌ఘడ్, ఏపీలోని అల్లూరి జిల్లా, తెలంగాణ ఏజెన్సీ గ్రామాలున్నాయి. పోలీసులకు, మావోయిస్టులకు తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో షెల్టర్ జోన్‌గా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఉండే అవకాశం ఉందని పోలీస్ యంత్రాంగం నిఘా పెడుతోంది. కుక్కునూరు ఎస్ఐ రాజారెడ్డి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు(ఎస్‌పీఎఫ్) సిబ్బందితో వలస ఆదివాసి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. కొత్తగా ఎవరైనా గ్రామాలకు వచ్చారా ? అని ఆరా తీశారు. ఇంటింటికి తిరిగి పరిశీలిస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో గోదావరిలోకి దూకిన తండ్రి

తండ్రి, కుమారుడి మృతదేహాలు లభ్యం..
దొరకని కుమార్తె ఆచూకీ

7

నేడు రైతుల ఖాతాల్లో సొమ్ములు

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల
లక్షా 3 వేల 761 మంది రైతుల ఖాతాల్లో రూ. 68.97 కోట్లు

భీమవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు చేయూతని చ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండవ విడత సొమ్ములు బుధవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లాలో 1 లక్షా 3 వేల 761 మంది రైతులకు వారి ఖాతాల్లో రూ. 68 కోట్ల 97 లక్షలు పడనున్నాయి. ఒక్కొక్క రైతుకు కేంద్రం వాటాగా రూ. 2 వేలు రాష్ట్రం నుంచి రూ. 5 వేలు మొత్తం రూ.7 వేలు అందుతాయి. నగదు జమ కార్యక్రమం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, రైతు సేవాకేంద్రాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జేసీ అధికారులతో సమీక్షించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, రైతుసేవా కేంద్రాల వద్ద రైతులు వీక్షించేలా డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేయాలన్నారు.

నియోజకవర్గాల వారీగా నగదు జమలు

నియోజకవర్గం	రైతులు	సొమ్ము రూ.కోట్లలో
ఆచంట	19,175	13.30
భీమవరం	8,335	5.68
నరసాపురం	11,965	7.63
పాలకొల్లు	14,458	8.91
తాడేపల్లిగూడెం	18,361	12.14
తణుకు	16,854	11.51
ఉండి	9,629	6.61
గణపవరం	4,884	3.19



జిల్లాలో కొత్తగా పోలింగ్ కేంద్రాలు

గతంలో 1461 స్టేషన్లు ఉండగా 1,564కు పెంపు
ఆమోదం కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు

భీమవరం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజోతి) : జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. గతంలో 1,461 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా వాటిని 1,564కు పెంచేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రానున్న ఎన్నికల్లో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. పోలింగ్ బూత్‌కు గతంలో 1500 ఓట్లు ఉండేలా నిర్ణయించారు. దీంతో పోలింగ్ పక్రియకు ఎక్కువ సమయం పట్టటంతో సంఖ్యను తగ్గించాలని నిర్ణయించారు. అందులో భాగంగా పోలింగ్ స్టేషన్‌కు 1200 మంది ఓటర్లు ఉండేవిధంగా ప్రతిపాదిం చారు. గతంలో ఉన్న పోలింగ్‌స్టేషన్‌ను మరో చోటకు మార్చేందుకు జిల్లాలో రెండుచోట్ల ప్రతిపాదించారు. అలాగే పేరు మార్పు కోసం రెండు పోలింగ్ స్టేషన్లు గుర్తించారు. జిల్లా కలెక్టర్ కార్యాయలంలో మంగళవారం సాయంత్రం డీఆర్వో శ్రీమన్నారాయణరెడ్డి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్‌స్టేషన్‌ల వివరాలను అందించారు. వారి అభిప్రాయాలను సేకరించారు.

నియోజకవర్గాల వారీగా పెరిగిన పోలింగ్ స్టేషన్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	కొత్త స్టేషన్లు
ఆచంట	1,78,990	187	192
పాలకొల్లు	1,94,038	190	203
నరసాపురం	1,69,199	169	181
భీమవరం	2,51,065	235	262
ఉండి	2,23,300	238	243
తణుకు	2,33,193	233	254
తాడేపల్లిగూడెం	2,13,229	209	249
	14,63,014	1,461	1,564



తాడేపల్లిగూడెంలో ప్రకృతి వైద్య దినోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆరా ఫౌండేషన్ వద్ద ప్రకృతి వైద్యదినోత్సవం మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వైద్యం, యోగా అంశాలపై ఆరా ఫౌండేషన్ అధ్యక్షుడు, యోగా గురువు కరిబండి రామకృష్ణ వివరించారు. యోగా, నేచురోపతి విధానాలతో డిసీజ్‌ఫ్రీ లైఫ్‌ను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆరా ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, రేణుక, నున్న నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులలో నేరుగా ప్రవేశాలు

తణుకు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య కాలేజీ డిగ్రీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ సీహెచ్.ఏడుకొండలు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. 347 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ ఉత్తీర్ణులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఈనెల 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9948121718 నంబరులో సంప్రదించాలని కోరారు.

స్వామిత్వ సర్వే సద్వినియోగం చేసుకోవాలి.


గ్రామసభలో మాట్లాడుతున్న డీపీవో

గణపవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేలో ఆస్తి యాజమానులకు అభ్యంతరాలు ఉంటే పరిష్కరిస్తామని డీపీవో ఎస్.రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు. వెంకట్రాజపురంలో మంగళవారం జరిగిన స్వామిత్వ గ్రామసభలో ఆయన రికార్డులను పరిశీలించారు. గ్రామకంఠంలో చిరకాలంగా ఉంటున్నప్పటికి కొందరికి హక్కుపత్రాలు లేవని, యాజమాన్య హక్కులు లేకపోవడంతో బ్యాంకుల్లో రుణఅర్హత పొందలేక ఇబ్బందులు పడుతున్నారని రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఇటువంటి సమస్యలకు స్వామిత్వ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందని అందరూ పూర్తిస్థాయిలో సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. సభలో ఈవోపీఆర్‌డీ పల్లా సత్యనారాయణమూర్తి, సర్పంచ్ ఎం.సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాల్లో రైతులకు వెసులుబాటు


కవిటంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పితాని వెంకట్

పోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయాల్లో రైతులకు ప్రభుత్వం అనేక విధాల వెసులుబాటు కల్పించిందని పితాని వెంకట్ అన్నారు. కవిటం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. తేమ శాతం 17పాయింట్లుగా నిర్ణయించడంతో పాటు ధాన్యం మద్దతు ధర కూడా పెంచిందన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ చుట్టిగుళ్ల పూర్ణిమ, ఎంపీడీవో బి.మంగాకుమారి, కార్యదర్శి కృష్ణవేణి, గుబ్బల అప్పన్నస్వామి పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: సీతారాంపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు కలవకొలను తాతాజీ ప్రారంభించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేయడం జరుగుతుందని తాతాజీ తెలిపారు.

అత్తిలి: అత్తిలి రామన్నపేట రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి గోపీకృష్ణ ప్రారంభించారు. ఎంపీపీ మక్కా సూర్యారావు, పోలిశెట్టి చందు, పోలిశెట్టి చంటి, దాసం బాబ్జీ, అత్తిలి సర్పంచ్ గంటా విజేత, కొనకళ్ళ విజయనిర్మల కాంతారావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రఘురామ

పాలకోడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రతి గ్రామానికి శుద్ధి జలాలతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మోగల్లులో ఆర్‌వో ప్లాంట్, రైతు సేవా కేంద్రం, సీసీ రహదారులు, కోరుకొల్లులో సీసీ రహదారులను మంగళవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో ఉండిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. మోగల్లు సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, కొత్తపల్లి నాగరాజు, ఎంపీపీ బీహెచ్.సత్యనారాయణరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి సూర్యనారాయణ రాజు, వనుం వెంకటేష్, సంకురుడు, కలిదిండి సందీప్ వర్మ, విజయానంద్, కొత్తపల్లి గోవర్ధన్‌రాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గంజాయిని నియంత్రించాలి : కలెక్టర్

భీమవరంటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ చదల వాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలపై ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి కలెక్టర్ నాగరాణి మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి వినియోగం అనే మాట వినిపించకూడదన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్, ఈగల్ బృందానికి తెలియజేయాలన్నారు.


ఆకివీడు ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగును పరిశీలిస్తున్న ఎంఈవో


పాలమూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఏడీ

ప్రభుత్వ విద్య అధ్వానం

విద్యార్థి తండ్రి ఫిర్యాదుతో అధికారుల పరిశీలన

ఆకివీడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా బోధన అధ్వానంగా ఉందని, ఆవరణలో అపారిశుధ్యంపై విద్యార్థి తండ్రి వర్ధినీటి లక్ష్మీవర ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అమరావతిలోని ప్రభుత్వ ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రసాద్ ఇటీవల ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంఈవో రవీంద్రను డీఈవో సూచించారు. ఫిర్యాదుదారు ప్రసాద్‌తో కలిసి ఇద్దరు ఉపాధ్యాయుల సమక్షంలో మంగళవారం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. తన పిల్లలు ఇద్దరు ఇక్కడ చదువుతున్నారని, విద్యలో వెనకబడ్డారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని పిల్లలను పంపిస్తే బోధన సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు మంచిగా భోజనం చేయకుండా డస్ట్‌బిన్‌లో పారేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు, కమిటీ నేతలతో బుధవారం సమావేశం నిర్వహించి బోధన మెరుగుపరుస్తామని ఎంఈవో తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

పెనుమంట్ర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలను మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో బియ్యం, కోడిగుడ్లు నిల్వలను పరిశీలించారు. భోజనం తయారీపై నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. పిల్లలు వినియోగిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.చంద్రశేఖర్‌ను కోరారు. ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనకు టచ్ టూల్స్ ప్రోగ్రాం

పాలకొల్లు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు టచ్ టూల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి తెలిపారు. ఎంఎంకేఎస్‌ఎం మునిసిపల్ హైస్కూల్‌లో 2 రోజుల శిక్షణ తరగతులను ఎంఈవో వీరాస్వామి మంగళవారం పరిశీలించారు. టచ్‌టూల్ ప్రోగ్రాం బోధనల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకుని అనంతరం వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో 2 గంగాధరశర్మ, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆర్ భవానీ ప్రసాద్, రాజశేఖర్, పి.రాము, కె.శ్రీనివాసరావు, కె.గణేశ్వరరావు, ఆర్ జేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు అన్నారు. ఏలూరుపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆశ్రం వైద్య బృందంతో మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కన్ను, చెవి, ముక్కు, గొంతు, మహిళల ఆరోగ్య సమస్యలు, మోకాలు, నడుము నొప్పులు, ఎముకలు, కిడ్నీ స్టోన్స్, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, వీవీ కృష్ణంరాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, మంతెన వెంకట రవివర్మ, కనగర్ల మధుసూదనరావు, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

ఇతరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం తగదు

పాలకొల్లు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇతరుల వ్యక్తిగత విషయాల్లో తలదూరిస్తే తీవ్ర పరిణామాలను చవి చూడవలసి వస్తుందని ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. సైబర్ మోసాలు, పర్యావసనాలు అంశంపై మంగళవారం జరిగిన సెమినార్‌లో ప్రిన్సిపాల్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ నేరాలకు విధించే శిక్ష, చట్టాలను వివరించారు. అధ్యాపకులు కె.భద్రాచలం, ఐఐసీ కన్వీనర్ రామకృష్ణ, వెంకటస్వామి, వై.యామిని, సీహెచ్.రవికుమార్, కె రోహిత్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

తణుకు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. రంగోత్సవ్‌లో పతకాలు సాధించిన విద్యార్థినులను మంగళవారం అభినందించారు. ఎస్.భారతీ జయలక్ష్మి కార్టూన్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. 16 మంది బంగారు పతకాలు, 8 మంది వెండి పతకాలు, 5గురు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిలో 30మంది అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

భీమవరం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఫార్వార్డు బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, కె.మహంకాళి పిలుపు నిచ్చారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. కేంద్రంలో మోదీ 11 ఏళ్ల పాలనలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీటీ ఎ.సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వైవి.ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, తిరుమాని కామేశ్వరరావు, నాగిడి శాంతమూర్తి, ఛాన్ బాషా, నీలాపు శ్రీను, దండు శ్రీనివాసరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

భీమవరం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని డీసీసీబీ మేనేజర్ వై.దుర్గారావు అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ బూరుగుపల్లి కాశీ శ్రీను, ఎస్ భద్రావతి నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, బ్యాంక్ సిబ్బంది పి.సౌజన్య, పెండ్యాల సరిత, కే పార్వతి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుకొల్లు దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

పాలకోడేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు రామలింగేశ్వరస్వామి ఆలయ పాలకవర్గంతో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, దేవస్థానం కమిటీ అధికారులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా గాదిరాజు రామాంజనేయరాజు, సభ్యులుగా చేకూరి వెంకటలక్ష్మి, సన్నిధి పద్మావతి, కె.వరలక్ష్మి, బి.విజయరాఘవి, జి.నాగలక్ష్మి, ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, టి.లక్ష్మీప్రసన్న ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ నందం తాతయ్య మృతి

అత్తిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్తిలిలో ఫొటోల తాతయ్యగా గుర్తింపు పొందిన నందం తాతయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 50 ఏళ్లుగా ఫొటోగ్రఫీ వృత్తిలో ఉన్నారు. సేవలందించారు. పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం మండల కన్వీనర్, ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా సేవలందించారు. ప్రాచీన, అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు తీసి ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకులు పోలిశెట్టి చంటి, చందు, దాసం బాబ్జీ, ఆనాల ఆదినారాయణరావు, ఆల్తి సతయనారాయణ తదితరులు సంతాపం తెలిపారు. తాతయ్య కుటుంబ సభ్యులకు విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పిఠాపురం అత్తిలి శాఖ తరపున సంతాపం తెలిపారు.

దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ జిన్నాకు సత్కారం

పెనుమంట్ర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన మంగళవారం నిర్వహించారు. పీఎంపీగా సేవలందిస్తూ నూర్ భాషా దూదేకుల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపటిన షేక్ సయ్యద్ అలీ జిన్నాను పీఎంపీల అసోసియేషన్ జిల్లా శాఖ సత్కరించింది. వీటీటీ.రాజు, పరమేశ్వరులు, చిట్టి సుభాన్, గోపాలకృష్ణ, నాగరాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

తణుకు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వం సాధన దిశగా జనగణనలో కులగణన చేపట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం ఇచ్చారు. బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, గుబ్బల వెంకటేశ్వరావు, అమ్మిరాజు పాల్గొన్నారు.



పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి అఖండ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. దీపోత్సవంతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది. - భీమవరంటౌన్

క్షీరా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



పాలకొల్లు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం క్షీరా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం గోపూజ, సాయంత్రం లీలా కల్యాణం నిర్వహించి హిమగిరి శిఖరునిగా అలంకరించి పంచహారతులు ఇచ్చారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, పాలక మండలి చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పెంటపాడు/కాళ్ల/మొగల్తూరు/తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పాలు, తేనే, పెరుగు, గంధం, విభూదితో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ కమిటి చైర్మన్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కమిటి సభ్యులు పర్యవేక్షించారు. కాళ్ల గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహారుద్ర హోమం నిర్వహించారు. సహస్ర దీపార్చన, కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మొగల్తూరు పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్షపత్రి పూజ చేశారు. గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య, స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం బాలాత్రిపుర సుందరి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

పెనుగొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నడిపూడి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి మన్నె రమేష్, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి, అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఫైళ్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. పారదర్శకంగా విచారణ చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఉలికిపాటు !

(5వ పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. వట్లూరులో మావోయిస్టు తలదాచుకున్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ హాస్టల్ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాలోని లాడ్జీలు, హోటల్స్, ప్రైవేటు హాస్టల్స్‌కు తనిఖీలు చేపట్టడానికి అన్ని రకాల చర్యలు చేపట్టారు.

మావోయిస్టులు వర్సెస్ పోలీసులు

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా వున్న సమయంలో కుక్కునూరు మండలంలోనే పలు ఘటనలు జరిగాయి. 2006 జూన్ 6న మావోయిస్టులు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌ను పేల్చి వేశారు. రెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, కూంబింగ్ దళాలకు జరిగిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. రేగులచెరువు ఆదివాసి గ్రామంలో నాటు తుపాకులు తయారు చేస్తూ ఆదివాసీలు పోలీసులకు దొరికారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అప్పట్లో మండవ రామిరెడ్డి అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడిని మావోయిస్టులు హతమార్చారు. రాష్ట్ర విభజన అనంతరం మావో యిస్టుల ఉనికి కొంతమేర తగ్గింది. పలుమార్లు మావోయిస్టుల సాహిత్యానికి సంబంధించి పోస్టర్లు, కరపత్రాలు వెలువడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

భీమవరం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో 15 మంది మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పశ్చిమ గోదావరి జిల్లా పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఏలూరులో జరిగిన దాడుల నేపథ్యంలో అప్రమత్తమయ్యామని, అంతేతప్ప ఎటువంటి సోదాలు, తనిఖీలు చేయలేదని తెలిపారు.ఎవరైనా అనుమానితులు కనిపిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కొత్త వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకొల్లు అర్బన్ :** నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీ ఆవరణలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. మహిళలు, పిల్లలకు పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- **ఆచంట :** ఆచంటేశ్వరుని ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 20న రామేశ్వర సత్రంలో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేలాదిగా వచ్చే భక్తుల దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.
- ఆచంట మండల పరిషత్ సమావేశం ఈ నెల 22 శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరగుతుందని ఎంపీడీవో బి. కృష్ణమోహన్ తెలిపారు.
- ఆచంట మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, పెన్మత్స సాయివర్మ తెలిపారు.
- **తణుకు :** మానవత సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంద్రయ్య నగర్‌లోని రెండు అంగన్ వాడీ సెంటర్‌లకు తణుకు శాఖ చైర్ పర్సన్ కటారి శారదాదేవి ఆర్థిక సాయంతో 15కుర్చీలు, 8నేల చాపలు, 30స్టీలు వాటర్ గ్లాసులు, స్టీలు వాటర్ డ్రమ్ము బహూకరించారు.
- తణుకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు 26మందికి బి.పి. షుగర్ పరీక్షలు చేసి రిపోర్టులు అందజేశారు.
- **తణుకు రూరల్ :** తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షతన జరుగుతుందన్నారు.
- **పెంటపాడు :** అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 20న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేస్తానని ఆర్యవైశ్య సంఘ రూరల్ మండల అధ్యక్షుడు బోనగిరి రమేష్ అన్నారు. చినతాడేపల్లిలో రూరల్ మండల ఆర్యవైశ్య సంగ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు.
- **పెనుగొండ :** తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించిన భాష్యం విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్.వెంకట అప్పారావు అభినందించారు. ఈ నెల 16న శ్రీకాళహస్తి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తమ విద్యార్థులు విజయం సాధించారన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు

ఇరగవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇరగవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం కడలి సత్యనారాయణ పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. మంగెన గంగాధరరావు, లైబ్రేరియన్ జీడీవీ.అయ్యప్ప స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం పర్యావరణ కాలుష్యం, నేను నాదేశం అంశం పై వ్యాసరచన పోటీ నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నరసాపురం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని శాస్త్రవేత్త సుబ్బారావు తెలిపారు. విద్యార్థులకు సాహిత్య, క్రీడా పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కుమారి, సుధీర్‌మోహన్, భాస్కర్, గణేష్, చిట్టిబాబు, సమత, సత్యనారాయణ సూర్యంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: మెగాస్టార్ చిరంజీవి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ బత్తుల హనుమంతరావు, ఉపాధ్యాయులు పిట్టా కరుణాకర్, ఆలీవలి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: శాఖా గ్రంథాలయంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వి.శాంత కుమారి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వంగా నరసింహారావు, పీవీ.ఆనంద కుమార్, పీఆర్‌వో ఎంఎన్‌వి సాంబశివరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకోడేరు: విద్యార్థులు మాదకద్రవ్యాల మోజులో తమ జీవితం నాశనం చేసుకోకుండా ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ కేసీహెచ్. వీర్రాజు అన్నారు. శాఖా గ్రంథాలయంలో తెన్నేటి మాస్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. గొల్లలకోడేరు శాఖ గ్రంథాలయంలో బాలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పి.వెంకటేష్, గ్రామ కార్యదర్శి గోపి, కృష్ణమూర్తి, భూపతిరాజు పొద్దు, భూపతిరాజు పృథ్వీరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక మహిళా భవనంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో వాసుదేవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజగోపాల్ మాట్లాడుతూ పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కారు చౌకగా ప్రభుత్వ భూములు పెట్టు బడి దారులకు అప్పగిస్తున్నారని కేంద్ర, రాష్ట్రం ప్రైవేటు జపం చేస్తోందన్నారు ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందుబాటులో ఉంచాలని ఈసందర్భంగా వక్తలు డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం సరైనది కాదన్నారు. విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్ కుమార్, కె.రాయపరాజు, సీహెచ్.లక్ష్మి, ఎం.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

29న జిల్లా మహాసభలు

పెనుగొండ: సీఐటీయు జిల్లా మహా సభలు ఈ నెల 29, 30 తేదీలలో పెనుగొండలో జరుగుతాయని ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 300 మంది హాజరయ్యే మహాసభలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు, కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొంటారన్నారు. కార్మిక సమస్యలు, చట్టాలు, హక్కులు తదితర అంశాలపై తీర్మానిస్తామని తెలిపారు.



మద్ది క్షేత్రంలో భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామి

కిక్కిరిసిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం చివరి మంగళవారం సందర్భంగా గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ ప్రదక్షిణలు, దీపారాధన, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి అత్యంత ప్రీతీకరమైన తమలపాకులతో అష్టోత్తరం పూజలు నిర్వహించారు. 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన నిత్యాన్నదాన సత్రంలో సుమారు 16 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మంగళవారం ఒక్కరోజే మద్ది ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.9,95,438 ఆదాయం లభించినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

సుందరగిరిపై సుదర్శన హోమం

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం జరిగిన సుదర్శన హోమం భక్తులకు కనువిందైంది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యాహవాచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. ఆ తరువాత మూల విరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం, హారతులు ఇచ్చారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గ్రంధి



తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్య నారాయణ ఎన్నికయ్యారు. ఇంజనీరింగ్ కళాశాలల నిర్వహణ, విద్యార్థుల ప్లేస్‌మెంట్, ఇతర విభాగాల్లో తమ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్య క్షునిగా పనిచేస్తున్న గ్రంధి సత్యనారాయణకు ఈ అవార్డు రావడం పట్ల ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, వాసవి కళాశాల కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, కళాశాల పాలకవర్గ సభ్యులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

సేవాభూషణ్, విద్యాభూషణ్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల్లో విశిష్టసేవలందిస్తోన్న ఉపాధ్యాయులు, వైద్యులు, క్రీడాకారులను గుర్తించి సేవాభూషణ్, విద్యాభూషణ్, కళాభూషణ్ జాతీయస్థాయి పురస్కారాలతో సత్కరించేందుకు ఉమ్మడిపశ్చిమగోదావరిజిల్లాలోని సంబంధిత రంగాల్లో సేవలందిస్తోన్న వ్యక్తులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేస్తామన్నారు. ప్రతిభావంతులు వారి సేవలను, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్‌లు, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 25లోగా ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పోస్టులో పంపాలని కోరారు. వివరాలకు ఫోన్‌నంబరు 96523 47207లో సంప్రదించాలన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడకుంటే తీవ్ర చర్యలు

» దిశ సమావేశంలో ఎంపీ పుట్టా ఆగ్రహం.. వివిధ పనులకు డెడ్‌లైన్



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు రోషన్, చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం కమిటీ చైర్మన్ అయిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో వాడీవేడిగా జరిగింది. పలు అంశాలపై ఎంపీ చర్చించి, వివిధ అభివృద్ధి పనులను అధికారుల వివరణ తీసుకుని వాటికి డెడ్‌లైన్లు విధించారు. ఎంపీ వేసిన ప్రశ్నలకు పలువురు అధికారులు నీళ్ల నమిలారు. ఇప్పటికైనా మారి వివిధ పనులకు ప్రతిపాదనలు పంపిస్తే తాను పార్లమెంట్‌లో నిధులు సాధనకు రాబోయే సమావేశాల్లో ప్రస్తావిస్తానంటూ.. ఎంపీ సమావేశం అనంతరం అధికారులకు సూచించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంజూరైన పనులు నిర్దేశిత సమయంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని, ఆర్వోబీల భూసేకరణ, ఇతర పనులపై వచ్చే మంగళ వారం సమీక్షిస్తాననగా, దీనిపై తాను వీసీలో పాల్గొంటానని ఎంపీ వివరించారు. జేపీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, సీపీవో వాసుదేవరావు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ నిలదీత

పూడ్చిన గుంతలు ఇటీవల మొత్తం కొట్టుకుపోయాయని ఎంపీ పుట్టా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయ రత్నంను ప్రశ్నించారు. గుంతలు పూడుస్తున్నా కొత్తగా ఏర్పడుతున్నాయని ఎస్‌ఈగా చెప్పగా, ఇలా అనడం సరికాదని, ఇక మీదట పనులపై ప్రతిపాదనలు ఏకమొత్తంగా పంపాలన్నారు. కొల్లేరు ప్రజల విషయంలో మానవతా దృక్ప థంతో మెలగాలని కోరుతున్నా అటవీ అధికారు లు అలక్ష్యం వహిస్తున్నారు. దీనిపై సీఎంకు చెప్పాలా అని హెచ్చరించారు.

సోమవారం రాత్రి తాను ఏలూరు ఆసుపత్రిని తనిఖీ చేశా. నర్సులు లేరు.. శానిటేషన్ అధ్వానం. పేషంట్‌కు మందులు కూడా సక్రమంగా ఇవ్వరా... విచారణ చేయండి. శానిటరీ కాంట్రాక్టును రద్దు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. సూపరింటెండెంట్‌ను జవాబుదారీ లేదా అని నిలదీశారు.

జిల్లాలో పరిశ్రమలు ప్రజలకు వినియోగించే సీఎస్ఆర్ ఫండ్స్‌ను ఖర్చు చేయకుండా కప్పదాట్లకు దిగుతున్నారు. ఆయా పరిశ్రమల నుంచి జిల్లాలో సేవా కార్యక్రమాలకు ఒక శాతం సీఎస్ఆర్ ఫండ్‌ను ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తా... దీనిపై అధికారులు నివేదిక సమర్పించాలన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ డెడ్‌లైన్

- జిల్లాలో 12 ఆర్వోబీల టెండర్లు ప్రక్రియను రైల్వే వెంటనే పూర్తిచేయాలి. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించాలి.
- కైకలూరు-గుడివాడ, కైకలూరు-భీమవరం రోడ్డు పనులు రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి.
- ఎంపీ ల్యాడ్స్ కింద చేపట్టిన పనులు డిసెంబరుకు పూర్తి చేసి.. ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి. ఈ ఏడాది పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.
- ప్రస్తుత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై 100 శాతం పురోగతి రాబోయే సమావేశంలో కనిపించాలి.

వారి పద్ధతి మారాలి : ఎమ్మెల్యేలు

- 'ఏలూరు జీజీహెచ్‌లో పరీక్షలు జరపకుండానే విజయవాడకు రిఫర్ చేస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. రహదారుల నిర్వహణ సక్రమంగా లేదు. సీతంపేట ఆర్వోబీ వద్ద అలైన్‌మెంట్ మార్చాలి. వట్లూరు పై ఓవర్ వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలి' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.
- నగరంలో బిషప్ హౌస్ ప్రాంతంలో ఇటీవల రోడ్డేశారు. మధ్యలో 70 మీటర్ల ముక్క వేయకుండా వదిలేశారు. గతంలోనే పూర్తిస్థాయిలో ప్రతిపాదన చేయలేదు. ప్రజలు నవ్వుకుంటున్నారు' అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.
- 'ప్రభుత్వాసుపత్రి సేవలు పారదర్శకంగా ఉండేలా జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లో సేవలపై ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు యాప్ రూపొందించా. వైద్య సిబ్బందిలో జవాబుదారీతనానికి చర్యలు చేపట్టా' అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు.
- 'ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కొల్లేరు ప్రాంతంలో సొసైటీ భూముల్లో దాళ్వా సాగును అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారు. సంప్రదాయ వ్యవసాయమే చాలా గ్రామాల రైతులు చేసుకుంటున్నారు. వారికి అటవీశాఖాధికారులు అనుమతి ఇవ్వాలి' అని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు.

పెండింగ్ బిల్లులపై అధికారులతో మంత్రి సమావేశం



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వర్మ

భీమవరం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మంగళవారం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లు కేంద్రమంత్రి వర్మను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. దాదాపు రూ.18 కోట్ల 80 లక్షలు ప్రభుత్వం నుంచి తమకు రావాల్సి ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి వర్మ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మునిసిపల్ అధికారులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటానని కాంట్రాక్టర్లకు మంత్రి హామీ ఇచ్చారు.



ఎర్రకాలువ వరదను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్ (ఫైల్)

ఎర్రకాలువ గట్లు పటిష్టతకు సీఎం సానుకూల స్పందన

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఎర్ర కాలువకు వస్తున్న వర ద నీరు కారణంగా ఎర్ర కాలువ గట్లు కోతకు గురి అవుతున్న నేపథ్యంలో వాటి పటిష్టతకు మంత్రి దుర్గేష్ కేబి నెట్‌లో చేసిన విజ్ఞప్తికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఫ్లడ్ డేమేజ్ రిపేర్ నిధులతో మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నిడదవోలులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఎర్ర కాలువ ముంపు రైతాంగం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలలో తెలుగు స్వాముల ఆందోళన

ఉండి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శబరిమలలో ఉండి ప్రాంతా నికి చెందిన అయ్యప్పస్వాములకు అవమానం జరిగింది. క్యూలైన్ ఎక్కడ అని అడిగితే ఓ పోలీస్ బెల్ట్ చూపించారు. దాంతో స్వాములంతా నిరసన తెలిపారు. తెలుగువాళ్లకు అవమానం కలిగేలా అక్కడ వ్యవహరించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. బెల్ట్ చూపించిన పోలీసును ఘటనా స్థలం నుంచి తప్పించారని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేక దర్శనం కల్పిస్తామంటూ పోలీసులు చెప్పి తప్పించుకోవడాన్ని తప్పుపట్టారు. ఉండికి చెందిన స్వాములు బైరెడ్డి అశోక చక్రవర్తి, బంటుమిల్లి నాగబాబులు అయ్యప్ప దర్శనం కోసం వెళ్లిన వారిలో ఉన్నారు. ఇప్పుడు నిరసన వీడియో వైరల్ అవుతోంది.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: జేసీ

ఆచంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధి కారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆచంట ఎంపీడీవో కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో ఆచంట, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమయ్యేట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోనె సంచె 600 గ్రాములు మాత్రమే ఉండాలన్నారు. అలా కాకుండా కేజీగా చూడటం వల్ల రైతు నష్టపోతాడన్నారు. సంచికి వచ్చి 41 కేజీలు ధాన్యం తూకం కాకుండా 45 కేజీలు తూకం వేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు పాత్ర ఉంటే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆచంట వేమవరంలో రీసర్వే పనులను జేసీ రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించిన రైతులకు మూడు రోజులకు ముందుగా సమాచారం అందించాలన్నారు.

ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్నా జేసీ, ఏఎస్పీ

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి మాసోత్సవాలు సందర్భంగా 500 మంది యువత, విద్యార్థులతో మంగళవారం యూనిటీ మార్చ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ జెండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. ముందుగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జేసీ మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యతా భావంతో మెలగాలని అన్నారు. జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ దౌత్య నైపుణ్యంతో 565 సంస్థానాలన్నింటిని మన జాతీయ జెండా కిందకు చేర్చిన గొప్ప యోధుడు వల్లభాయ్ పటేల్ అన్నారు. కేంద్ర క్రీడలు యువజన సంక్షేమ, మైభారత్ యువజన అధికారి సుంకర రాము, జడ్పీ సీఈవో యం శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు, సెట్‌వెల్ సీఈవో కేఎస్ ప్రభాకరరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సహాయ సంచాలకులు బి. రామ్‌కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి గిరిబాబు, పట్టణ ప్రముఖులు, ఎన్‌సీసీ, సేవా సంస్థల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

ఆధార్ కార్డు అప్‌డేట్ చేయిస్తానని..

ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకేశాడు.. తండ్రీ కొడుకుల మృతదేహాలు లభ్యం



దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్, కుమార్తె జాహ్నవి (ఫైల్ ఫొటో)

యలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి తన కుమారుడు, కుమార్తెలతో కలిసి బైక్ పై సోమవారం రాత్రి చించినాడ బ్రిడ్జి పైకి వచ్చి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకున్నది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థానికులు తెలిపిన వివరావి.. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (43) సోమవారం సాయంత్రం తన కుమారుడు మోహిత్(14), కుమార్తె జాహ్నవి(11)లను తీసుకుని ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయించే పని నిమిత్తం మలికిపురం వెళుతున్నామని భార్యకు చెప్పి బైక్‌పై బయటకువచ్చాడు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం రాత్రి బ్రిడ్జిపై బైక్, చెప్పులు, పర్స్ ఉండటంతో స్థానికులు వెళ్లిచూడగా బైక్ కవర్‌లో దుర్గాప్రసాద్ పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసె న్సు, బంధువుల ఫోన్ నంబర్ల కాగితం ఉంది. స్థానికులు బంధువులకు వెంటనే సమాచారం అందించారు. వారి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం నుంచి పోలీసులు, గజ ఈత గాళ్లు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్‌మృతదేహాలు మంగళవారం సాయంత్రం గోదావరిలో లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. చిన్నారులతో కలిసి తండ్రి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం స్థానికులను కలిచివేస్తోంది. ఆత్మహత్యకు కుటుంబ వ్యవహారాలే కారణంగా అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యలమంచిలి ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. అంతకుముందు ఈ ఘటనపై భార్య నాగవేణి తన భర్త, కుమార్తె, కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్టు మలికిపురం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

సొసైటీ మాజీ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్‌కు రిమాండ్



బజ్జీని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

దెందులూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పోతునూరులోని భోగేశ్వరస్వామి సహకార సొసైటీలో అక్రమాలు రుజువైన కేసులో మాజీ అధ్యక్షుడు దూళిపాళ నాగేంద్ర వరప్రసాద్ (బజ్జీ)కి భీమడోలు సెషన్స్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బజ్జీని భీమడోలు కోర్టుకు పోలీసులు సోమవారం తరలించగా, అక్కడ బెయిల్ కోసం నాగేంద్రవరప్రసాద్ లాయర్ ద్వారా కోర్టు వద్ద విశ్వప్రయత్నాలు చేశారు. ఈక్రమంలోనే భీమడోలు కోర్టు వద్ద వాదనలు జరుగుతున్న సమయంలోనే వైసీపీ,టీడీపీ నాయకులు ఇరువర్గాలు బాహాబాహీకి దిగడం చర్చనీయాంశమైంది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు బజ్జీని ఏలూరు జిల్లా జైలులో రిమాండ్‌కు తరలిస్తూ మంగళవారం తెల్లవారుజామున జడ్జి ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణగా ఉండాల్సిన స్థానంలో ఉండి అక్రమాలకు పాల్పడటంపై జడ్జి తీవ్రంగా పరిగణించి సెక్షన్ 409 కింద రిమాండ్ విధిస్తూ జడ్జి ప్రియదర్శిని ఆదేశాలు ఇచ్చారు. బజ్జీని దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ రిమాండ్‌కు తరలించారు. ఈ సొసైటీలోనే రూ.అరకోటిపైనే నిధులు స్వాహా చేశారని ఆరోపణలపై ఆదివారం బజ్జీని దెందులూరు పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

అనుమతి లేకుండా బోటు నడుపుతున్న వ్యక్తిపై కేసు



పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ వీరేశ్వ రస్వామి శివక్షేత్రం సమీపంలో గోదావరి నదిలో అనధికారిక ంగా ఫైబర్ బోటుపై ప్రయాణికులను తర లిస్తున్న వ్యక్తిపై కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. లైసెన్సు లేకుండా ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించ కుండా 28 మంది ప్రయాణికుల వద్ద 150 రూపాయలు చొప్పున వసూలు చేసి తరలిస్తున్న సమాచారం మేరకు బోటు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. లైసెన్సు, రూట్ అనుమతి లేకుండా మానవ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిన నేరం కింద అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

చింతలపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిగూడెం నుంచి చింతలపూడికి వచ్చే దారిలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా ఎ.సత్యనారాయణ నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న ఒకరికి జరిమానా

లింగపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని బైండోవర్ చేసి ఆ వ్యక్తికి జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సారా అక్రమంగా అమ్మకాలు జరపడంతో పాటు ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతుండటంతో లింగపాలెం మండల తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండోవర్ చేశామని, తహసీల్దార్ అతనికి ఐదువేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్‌ఖలీల్, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

దెందులూరు,నవంబరు 18(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వ్యక్తి రైలు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మంగళవారం దెందులూరు రైల్వే గేటు సమీపంలో ఉదయం గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు కలిగి ఉంటాడని 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు కలిగి బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు నలుపు గీతలు గల పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. రైల్వే హెచ్‌సీ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు

మద్యం షాపు వద్ద కొట్లాట

మొగల్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):కెపిపాలెం సెంటర్‌లో గల మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి మద్యం మత్తులో ఒక వ్యక్తిని కర్రతో కొట్టి తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పసలదీవి గ్రామానికి చెందిన కొట్టు శివన్నారాయణ కొంత కాలంగా కెపిపాలెంలో నివాసం ఉంటున్నాడు. అతని సోదరుడు సుబ్బారావుకు ఆపరేషన్ నిమిత్తం నరసాపురం ఆసుపత్రికి వెళ్ళి తిరిగి వస్తుండగా 10 గంటలు సమయంలో బ్రాందీషాపు వద్ద ఆగాడు. ఇదే సమయంలో చామకూరిపాలెంకు చెందిన హరి అనే వ్యక్తి మద్యం షాపు నిర్వాహకులతో గొడవకు దిగడంతో శివన్నారాయణ కలుగజేసుకుని హరిని సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో కోపానికి గురైన హరి శివన్నారాయణను చితకబాదారు. శివన్నారాయణ స్పృహకోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. జరిగిన సంఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం సాయంత్రం బ్రాందీ షాపు వద్ద ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'బలవంతంగా భూ సేకరణ దుర్మార్గం'

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్‌మెంట్ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాలు, దళితులకు ఉపయోపగడే అసైన్డ్‌మెంట్ భూములను అభివృద్ధి పేరుతో బలవంతంగా భూసేకరణ చేయడం దుర్మార్గమన్నారు. దళితులు, పేదలకు సంక్షేమ పథకాలు సాకు చూపి సాగు చేసుకుంటున్న భూములను సైతం భూస్వాములకు కట్టబెట్టే యత్నానికి పూనుకున్నాయని మండిపడ్డారు.

బడుగులపై దాడులు ఆపాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత అణచివేతను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా సీపీఐ సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత, అణచివేతను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం నినాదంతో ధర్నాను నిర్వహించారు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

పాలకోడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు మాని రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరను ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా 23వ జిల్లా మహాసభలు మంగళవారం అల్లూరి సీతారామ రాజు, డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో జరిగింది.

తండ్రి ఆస్తి కోసం తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ సృష్టి

కలెక్టర్‌కు మహిళ ఫిర్యాదు

ఏలూరు రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): కాలం చేసిన తన తండ్రి ఆస్తి, ఉద్యోగం కాజేయడానికి తన సోదరి ఏలూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందారని, దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలంటూ ఒక మహిళ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఏలూరుకు చెందిన పులి స్పందన, చందన అక్క చెల్లెళ్లు. వీరి తండ్రి గోపాలరావు భీమవరం మండలం చిన్నరంగనిపాలెంలో మునిసిపల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. గోపాలరావు భార్య ఝాన్సీ లక్ష్మీ రాణి 2012లో మృతి చెందగా గోపాలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే స్పందన సోదరి చందన గరికపాటి పరిమళ పుష్ప అనే మహిళతో కుమ్మక్కై తన తండ్రి పుష్పను రెండో వివాహం చేసుకున్నాడని తప్పుడు ధృవపత్రాలతో మరణానంతరం లబ్ధి పొందాలని ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో తప్పుడు సమాచారంతో పాటు తన సంతకం లేకుండా ఫోర్జరీ సంతకంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందారని ఆరోపించారు. ఎవరిదో పాస్‌పోర్టు ఐడిని జత చేసి తన స్టేట్‌మెంట్ కానీ డాక్యుమెంట్స్‌గాని సంతకం కానీ చేయకుండానే చేసినట్లు ఫోర్జరీ చేసి తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లి ఝాన్సీ లక్ష్మీ రాణి మొదటి భార్యగా పరిమళ పుష్ప రెండో భార్యగా పులి చందన విడాకులు పొందిన కుమార్తెగా సర్టిఫికెట్ మంజూరు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం తాను ఎటువంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తండ్రి ఉద్యోగాన్ని అక్రమ మార్గంలో పొందేందుకు తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారని దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని స్పందన విజ్ఞప్తి చేశారు.

బెల్ట్ షాపు నిందితులకు ఊరట

10 లీటర్ల లోపైతే ఒకే.. వచ్చే నెల 13న లోక్ అదాలత్‌లో రాజీకీ పచ్చజెండా


జిల్లా వ్యాప్తంగా 430 కేసులు



నరసాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన నిందితులకు ఊరట లభించనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం గడువును పెంచడంతో పాటు కొత్త నిబంధనలు జారీ చేసింది. 10 లీటర్లలోపు పట్టుబడిన కేసుల్ని లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోనే అవకాశం కల్పించింది. దీంతో పాటు నిందితుడిపై గతంలో ఎక్సైజ్‌కు సంబంధించిన కేసులు ఉండకూడదు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఉన్న కేసుల్ని కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించింది. వచ్చే నెల 13న జరిగే లోక్ అదాలత్‌లో ఈ కేసులు పరిష్కారం కానున్నాయి. జిల్లాలోని ఆరు ఎక్సైజ్ సర్కిల్స్ కార్యాలయాల్లో మొత్తం 430 కేసులు నమోదు అయ్యాయి. సుమారు 619 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 430 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఇవన్ని డిసెంబర్ 13న రాజీ కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొచ్చింది. వేలం పాట ద్వారా దుకాణాలను కేటాయించింది. అయితే బెల్ట్‌షాపులకు అనుమతి ఇవ్వలేదు. పాటదారులు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించింది. దీంతో గ్రామాలు, పట్టణాల్లో కొంత మంది మద్యాన్ని కొనుగోలు చేసి అనధికారికంగా విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తూ అనేక కేసులు నమోదు చేశారు. అయితే పది లీటర్ల లోపు పట్టుబడిన నిందితుల సంఖ్య తక్కువగా ఉంది. పది లీటర్ల దాటి పట్టు బడిన కేసు లే ఎక్కువగా ఉన్నాయి. కేసు రా జీలో ప్రభు త్వం మరో నిబంధన పెట్టింది. పట్టుబడిన మద్యం బాటిల్ ధరకు నిందితుడు మూడు రెట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఎక్సైజ్ దాడుల్లో రూ.80 మద్యం బాటిల్స్ దొరికితే దానికి నిందితుడు మూడు రెట్లు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అన్ని బాటిళ్ల ధరల్ని లెక్కగట్టి వాటికి పెనాల్టీలు విధిస్తూ సర్కిల్ వారీగా ఎక్సైజ్ పోలీసులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఈ వివరాలను పట్టుబడిన నిందితుడికి తెలియజేసి కేసు రాజీ చేసుకోవాలంటే ఇంత మొత్తం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఈసారి గడువు పెంచారు

రాంబాబు, ఎక్సైజ్ సీఐ, నరసాపురం



గతంలో లోక్ అదాలత్‌లో ఈ తరహా కేసులు రాజీ చేశాం. అయితే ఈ సారి ప్రభుత్వం గడువు పెంచింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు నమోదైన పది లీటర్ల లోపు కేసుల్ని రాజీ చేసుకునే వెలుసుబాటు కల్పించింది. పట్టుబడిన మద్యానికి మూడు రెట్లు చెల్లించి నిందితుడు రాజీ చేసుకోవచ్చు. నరసాపురం సర్కిల్‌లో 136 కేసులు ఉన్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి రూ.2.30లక్షలు పెనాల్టీ రూపంలో రానుంది.